# నేతన్నలపై చిన్నచూపేలా..?

- సిరిసిల్ల నేత కార్మికులకు భరోసా కరువు
- అధినేతలు, అతిరథులు వచ్చినా రిక్తహస్తమే
- మోడీ వేములవాడకు వచ్చినా మొండిచేయి
- మెగా పవర్‌లూం క్లస్టర్ ఊసే లేదు
- సిరిసిల్లకు సీఎం రేవంత్ వచ్చినా ఇచ్చిందేం లేదు
- కార్మిక కుటుంబాలకూ దక్కని బాసట
- ఆగ్రహిస్తున్న నేతన్నలు
- అండగా నిలిచే నేత కేసీఆర్ కోసం ఎదురుచూపులు
- నేటి రోడ్‌షోలో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు



కార్మికలోకం చిన్నబోయింది. ఉపాధి లేక.. ఆదుకునేవాళ్లు లేక ఐదు నెలలుగా గోసపడుతున్నది. కేసీఆర్ పదేళ్ల పాలనలో చేతినిండా పని.. పనికి తగ్గ కూలితో రంది లేకుండా బతికిన కార్మిక లోకం, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్టింపులేమితో ఆగమైపోతున్నది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వస్తున్న అధినేతలు తమ బతుకులకు బాసటగా నిలుస్తారని భావించిన నేతన్నలకు నిరాశే ఎదురైంది. ఇటీవల రాజన్న సిరిసిల్ల గడ్డపై తొలిసారి కాలు మోపి, వేములవాడకు వచ్చిన ప్రధాని మోడీ సిరిసిల్లకు మెగాపవర్‌లూం క్లస్టర్ ప్రకటిస్తారని, తమ గురించి నాలుగు మాటలు మాట్లాడుతారని పెట్టుకున్న నమ్మకం సన్నగిల్లింది. సిరిసిల్లకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సైతం వస్త్రపరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కిస్తామని ఒక్క మాట మాట్లాడకపోవడంపై కార్మికుల కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇద్దరూ ఇలా వచ్చి అలా వెళ్లారే తప్ప కనీసం అసువులు బాసిన నేత కుటుంబాలకు ఏమాత్రం భరోసా ఇవ్వకపోవడంపై మండిపడుతున్నాయి. తమ ప్రియతమ నేత, భరోసానిచ్చే నాయకుడు కేసీఆర్ శుక్రవారం సిరిసిల్లకు వస్తుండడంతో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

రాజన్న సిరిసిల్ల, మే 9 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం వేములవాడకు వచ్చారు. 77 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో మొదటిసారి ప్రధానమంత్రి హోదాలో వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. తర్వాత జనసభకు హాజరయ్యారు. అయితే ఈ సభలో మెగాక్లస్టర్ ప్రకటిస్తాడని కొండంత ఆశలు పెట్టుకొని నేతన్నలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తమ గురించి మోడీ నాలుగు మాటలు చెపుతారని ఎంతో ఊహించారు. దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ పుణ్యక్షేత్రానికి నిధులు ఇస్తారని భావించారు. కానీ, ఏ ఒక్కరి ఆశలు నెరవేరలేదు. ఎంతసేపూ రాజకీయాల గురించి తప్పితే ఒక్క హామీ ఇవ్వలేదు. వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు గానీ, మెగా క్లస్టర్ గురించి గానీ, వేములవాడ అభివృద్ధిపై గానీ ఒక్క మాట మాట్లాడలేదు. పైగా మరమగ్గాలు నడవక ఉపాధి కరువై ఇటీవల ఉసురు తీసుకున్న నేతన్న గురించి కనీసం ప్రస్తావించ లేదు. బాధిత కుటుంబాలకు ఏమాత్రం భరోసానివ్వలేదు. అంత పెద్ద నేత, అదీ మొట్టమొదటిసారిగా వచ్చిన సందర్భంగా ఏదో ఒకటి చేస్తారని ఆశించినా నిరాశే మిగిలింది. ప్రధాని అయినా తమకు మేలు చేస్తారని ఆశించిన నేత కార్మికులు అడియాశలు అయ్యాయి.

### రేవంత్‌దీ అదే తీరు

రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఎన్నో మాటలు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తమను ఆదుకుంటాడని నేతన్నలు భావించారు. ప్రధాని పర్యటనకు ముందు అంటే ఈ నెల 3న ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి రాగా.. అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. తమ కోసం ఏమో చేస్తారని, సిరిసిల్లకు ఏదో ఒకటి ఇస్తారని ఆశించారు. కానీ, ఆ రోజు రేవంత్‌రెడ్డి కోసం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 వరకు సభా స్థలిలో ఎదురుచూసినా నేతన్నల గురించి ఒక్క మాట మాట్లాడలేకపోయారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి వచ్చిన ఆయన ఏ భరోసా ఇవ్వలేకపోయారు. ఎంతసేపూ రాజకీయ పార్టీలపై తిట్లదండకమే తప్ప అభివృద్ధి కోసం ఏంచేస్తమో చెప్పలేకపోయారు. ఆర్డర్ల గురించి కూడా ఏ భరోసా ఇవ్వలేకపోయారు.

### కేసీఆర్ పాలనలో భరోసా

ఉమ్మడి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వస్త్ర పరిశ్రమ నిరాదరణకు గురైంది. నాటి పాలకుల పాపం అప్పుడు నేతన్నలకు శాపంగా మారింది. తీవ్ర సంక్షోభంతో ఉపాధి కరువై ఆత్మహత్యల పరంపరతో మరమగ్గాల్లో మరణ మృదంగం మోగింది. సిరిసిల్ల కాస్త ఉరిసిల్లగా మారింది. కానీ, కేసీఆర్ సర్కారు నేతన్నల సంక్షేమం కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి భరోసా కల్పించింది. ₹3వేల కోట్ల విలువైన బతుకమ్మ, ఆర్వీఎం, క్రిస్మస్, రంజాన్ తోఫా వస్త్ర ఆర్డర్లు ఇచ్చి, చేతినిండా పని, పనికి తగ్గ కూలి ఇచ్చి అండగా నిలిచింది. నేతన్నలకు చేతినిండా పనికల్పించాలనే ఉద్దేశంతో ఏటా ₹350కోట్ల విలువైన కోటీ బతుకమ్మ చీరలను తయారు చేయించింది. ప్రతి నెలా ₹15వేల నుంచి ₹20వేల కూలి అందేలా పని కల్పించింది. అలాగే పదిశాతం యారన్ సబ్సిడీ ప్రకటించింది. యారన్ సబ్సిడీపై ఒక్కో కార్మికుడికి ₹30వేల నుంచి ₹50వేల దాకా అదనంగా కూలి అందింది. అందులో 2018నుంచి 2021 వరకు 5300 మందికి ₹32.67కోట్లు లబ్ధి చేకూరింది. అలాగే వచ్చిన కూలీ డబ్బులను సద్వినియోగం చేసుకునేలా కార్మికుల కోసం చేయూత త్రిఫ్ట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో 2017-20 సంవత్సరానికి గాను 1801 మందికి ₹5.14కోట్ల లబ్ధి చేకూరింది. రైతుల మాదిరిగానే నేతన్నకు కేసీఆర్ ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది. కార్మికుడు ఎలా చనిపోయినా కుటుంబం రోడ్డున పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వమే ఎల్ఐసీ పాలసీ చేయించింది. 59 ఏండ్ల లోపున్న 4806 మందికి బీమా చేయించింది. అందులో 27 మంది కార్మికులు చనిపోగా, వారి కుటుంబాలకు ₹5లక్షల చొప్పున ₹కోటీ 35లక్షల చొప్పున చెల్లించింది. ఇలా అనేక పథకాలతో ధీమానిచ్చింది.

### ఐదునెలల్లోనే తారుమారు

నాడు చితికిన బతుకులకు కేసీఆర్ సర్కారు భరోసా కల్పిస్తే.. నేడు కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో అంతా తారుమారైంది. ₹300 కోట్లు పెండింగ్ బకాయిలు ఇవ్వక, వస్త్ర ఉత్పత్తులకు జీవో విడుదల చెయ్యక పరిశ్రమ మూతపడింది. ఆకలితో అలమటించిన నేతన్నలు అన్నమో రామచంద్రా..? అంటూ అర్థించాల్సిన దుస్థితి వచ్చింది. ఈ పరిస్థితుల్లో నేతన్నలు మళ్లీ ఆత్మహత్యల బాటపడుతున్నారు. ఇప్పటికే ఐదుగురు ఉసురు తీసుకున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ముమ్మందు సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారుతుందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తాము భరోసాగా ఉన్నామని గుర్తు చేస్తున్నారు. ఆయన తప్ప మరెవ్వరూ మేలు చెయ్యరంటూ బాహాటంగానే చెబుతున్నారు. సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ ఇవ్వాలంటూ గతంలో మాజీ మంత్రి కేటీఆర్ పలుసార్లు ప్రధానితో పాటు కేంద్ర మంత్రులందరికీ లేఖలు రాసినా.. స్వయానా ఢిల్లీకి వెళ్లి వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పుడైన మోడీ తీపీ కబురు చెబుతారనుకుంటే ఏ భరోసా ఇవ్వకుండా వెళ్లిపోయారని మండిపడుతున్నారు. సీఎం హోదాలో మొదటిసారి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా గదే ఊకదంపుడు ఉపన్యాసమిచ్చారని, ఏ హామీలు ఇవ్వకుండా వెళ్లిపోయారని ఆగ్రహిస్తున్నారు. అధినేతలు వచ్చినా తమకేమీ ప్రయోజనం లేదని, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### నేడు కార్మిక క్షేత్రానికి ఉద్యమ నేత కేసీఆర్

కార్మిక క్షేత్రానికి ఉద్యమ నేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నేడు సిరిసిల్లకు రానున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం 5గంటలకు నేతన్న చౌక్‌లో రోడ్‌షోలో పాల్గొననున్నారు. కాంగ్రెస్, బీజేపీ మోసాలను కండ్ల ముందుంచడంతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు గెలువాల్సిన ఆవశ్యకతను వివరించనున్నారు. అనంతరం అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్ మీదుగా సిద్దిపేట జిల్లాకు బయలు దేరుతారు. కేసీఆర్ రోడ్‌షోకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తమ అభిమాన నేతకు ఘనస్వాగతం పలికేందుకు నేతన్నలు సిద్ధమయ్యారు. తమకు ఆపత్కాలంలో అండగా నిలిచిన తీరుకు కృతజ్ఞతగా పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఇటు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గంలోని కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు.



కరీంనగర్‌లో నినదిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, అభివాదం చేస్తున్న కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

### మేధావులు ఆలోచించాలి

కరీంనగర్ అంటే మామూలు గడ్డ కాదు. ఇది చైతన్యమైన గడ్డ. ఇక్కడి మేధావులు, విద్యావంతులు, కవులు, కళాకారులు ఎంతో విజ్ఞులు. నేను గులాబీ జెండాను ఎత్తినప్పుడు ఇదే గడ్డలోని ఎస్సారార్ కాలేజీ నుంచే జై తెలంగాణ నినాదమిచ్చిన. కరీంనగర్ ఇచ్చిన స్ఫూర్తితోని ఆ నినాదం, ఆ జెండా ఆకాశమంత ఎత్తుకు ఎగిరింది. కరీంనగర్ దీవెనలతోనే తెలంగాణ సాధించిన. ఒకనాడు తెలంగాణ వాదం బలహీనపడిందని కాంగ్రెస్ నాయకులు అన్నప్పుడు తెలంగాణ పౌరుషం చూపాలని నా పదవులకు రాజీనామా చేసిన. 2006లో జరిగిన ఉప ఎన్నికలో 2.50 లక్షల మెజార్టీ ఇచ్చి నన్ను గుండెల్లో పెట్టుకున్న గడ్డ ఇది.

**- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

### సత్తా ఉన్న నాయకుడు వినోద్

వినోద్ కుమార్ మేధావి. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టిన విద్యావంతుడు. న్యాయ వాది. ఉద్యమ సమయం నుంచి నాతోపాటు కలిసి నడిచిన నాయకుడు. ఈ ప్రాంత సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి. స్మార్ట్ సిటీ సాధించడానికి.. నాపై ఒత్తిడి తెచ్చిన నాయకుడు. అంతేకాదు, పార్లమెంట్‌లో అంశం ఏదైనా అనర్గళంగా మాట్లాడే సత్తా సామర్థ్యం ఉన్న వినోద్‌కుమార్‌ను గెలిపించడం వల్ల ఈ ప్రాంతానికే కాదు.. తెలంగాణకు న్యాయం జరుగుతుంది. అందుకే చైతన్యం మూర్తీభవించిన గడ్డ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి. ముఖ్యంగా యువత అన్ని రకాలుగా ఆలోచించాలి. మంచి వాళ్లకు ఓటేస్తే మంచి జరుగుతది. ఆషామాషీగా తీసుకోవద్దు. అడ్డిగుడ్డిగా ఓటేస్తే దెబ్బతింటం.

**- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

### అచ్చే దిన్ కాదు.. సచ్చేదిన్

మోడీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఏ ఒక్క వర్గానికీ మేలు జరగలేదు. 150 హామీలు ఇచ్చిండు. ఏ ఒక్కటైనా అమలు చేసిండా? సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ జరిగిందా? సబ్ కా సత్తెనాస్ జరిగింది. డీజిల్, పెట్రోల్ ధర పెరిగింది. ధరలు పెరిగినయి. అచ్చేదిన్ కాదు.. ప్రజలు సచ్చే దిన్ వచ్చింది. వికసిత్ భారత్, విఫల భారత్ అయింది. పదేళ్ల క్రితం ఎన్నికలప్పుడు మోడీ ఒక మాట చెప్పిండు. మీరు నన్ను, బీజేపీని గెలిపిస్తే విదేశాల్లో ఉన్న నల్లధనం తెచ్చి ఇంటికి ₹15 లక్షలు ఇస్తా అన్నడు. మరీ కరీంనగర్‌లో రూ.30 లక్షలు వచ్చాయటా! వచ్చినయా? బండి సంజయ్ తెచ్చిచ్చిండట కదా! ₹15 లక్షలు లేదు, ₹30 లక్షలు లేదు. అంతా గ్యాస్.. ట్రాష్! ఏ ఒక్క వర్గానికీ మేలు జరగలేదు. బీజేపీ ఎజెండాలో పేదల మాట ఉండదు. కార్పొరేట్ల కోసం రూ.15 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసిండు గానీ, రైతులకు రూపాయి ఇవ్వలేదు. ఎవరికీ కూడా మేలు జరగలేదు. మోడీ చేసే ఎమోషనల్ బ్లాక్ మెయిల్‌ను నమ్మద్దు. యువకులు, విద్యార్థులు, మేధావులు, రచయితలు ఆలోచించాలి.

**- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**



కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో రోడ్‌షోకు అశేషంగా తరలివచ్చిన జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

# వినోద్ గెలుపు ఖాయం



అభివాదం చేస్తున్న కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్

- నా సర్వే ప్రకారం 8 శాతం ముందంజలో ఉన్నడు
- ఎన్నికల దాకా ఇదే చైతన్యం చూపాలి
- 'బండి' మాట్లాడే భాష ఏందో మనకే అర్థం కాదు
- పార్లమెంట్‌లో ఎవరికి అర్థమైతది?
- భాషరాని సంజయ్ కావాలా..? విద్యావంతుడైన వినోద్ కావాలా?
- చైతన్యమైన గడ్డ కరీంనగర్ ఆలోచన చేయాలి
- కరీంనగర్ రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



అభిమానులకు అభివాదం చేస్తున్న కేసీఆర్

కరీంనగర్‌కు ఎప్పుడొచ్చినా అద్భుతమైన ఎమోషనల్‌గా స్వాగతం పలికిన్రు. ఇప్పుడు కూడా అదే అభిమానం చూపిన్రు. నాయకుల ఆధ్వర్యంలో రోడ్‌షో అద్భుతంగా చేసిన్రు. ఇదే ఉత్సాహంతో ఎన్నికల దాకా పనిచేయాలి. బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలి.

**- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

కరీంనగర్, మే 9 (నమస్తే తెలంగాణ) : సర్వే ప్రకారం బోయినపల్లి వినోద్ కుమార్ ఎనిమిది శాతం ఓట్ల అధిక్యంతో ముందంజలో ఉన్నారని, కరీంనగర్‌లో ఆయన గెలుపు ఖాయమని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జోస్యం చెప్పారు. మీరందరు కూడా ఈ నెల 13వ తేదీ దాకా ఇదే చైతన్యం చూపాలని, విద్యావంతుడైన వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి కరీంనగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. రాంనగర్ చౌరస్తా నుంచి తెలంగాణ చౌక్ వరకు బస్సుయాత్రగా వచ్చారు. అనంతరం అక్కడే ప్రజలనుద్దేశించి అధినేత ప్రసంగించారు. ఉద్యమం నుంచి నేటి వరకు బీఆర్ఎస్‌కు అండగా నిలిచిన కరీంనగర్ గడ్డ ప్రాముఖ్యతను కొనియాడారు. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చి హామీలను అమలు చేయకుండా.. ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను.. అలాగే, ఎన్నికలొచ్చినప్పుడల్లా ఎమోషన్ బ్లాక్‌మెయిల్ చేస్తూ ఓట్లు దండుకుంటున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బండి సంజయ్ గెలువడం ద్వారా కరీంనగర్‌కు ఏమైనా లాభం జరిగిందా? అని ప్రశ్నించారు. సంజయ్ ఒక్కనాడైనా పార్లమెంట్‌లో మాట్లాడిండా.. గట్టిగ మాట్లాడితే హిందా, ఇంగ్లిషా, తెలుగా అనేది మనకే అర్థం కాదని, ఇక పార్లమెంట్‌లో ఎవరికి అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. అదే విద్యావంతుడు, న్యాయవాది అయిన వినోద్‌కుమార్‌ను గెలిపించుకుంటే పార్లమెంట్‌లో స్థానిక సమస్యలను ప్రస్తావించగలుగుతాడని, కరీంనగర్ ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి మేలు జరుగుతుందని చెప్పారు. ఇక్కడ జరిగిన స్మార్ట్ సిటీ పనులను వినోద్‌కుమారే సాధించారని, ప్రతి రోజు తనతో గొడవపడి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నిధులు తెచ్చాడని చెప్పారు. కరీంనగర్‌ను తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని, ఈ అభివృద్ధి కండ్ల ముందే కనిపిస్తున్నదని అన్నారు. కరీంనగర్ చుట్టూ నాలుగు జలధారలు ఆవిష్కరించామని, నాలుగు నెలల పాలనలో అవి మాయమయ్యాయని ఆవేదన చెందారు. తొమ్మిదేండ్లపాటు రెప్పపాటు పోకుండా కరెంటిచ్చామని, అది ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. కరీంనగరంలో రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చామని, నిత్యం నీటి సరఫరా చేశామని, కానీ, ఇప్పుడు నీళ్ల కోసం మళ్లీ బిందెలు పట్టాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందారు. ఈ దుస్థితికి కారణం కాంగ్రెస్సేనని మండిపడ్డారు. నోటికొచ్చిన వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రధానంగా ఆరు గ్యారంటీల్లో 13 అంశాలున్నాయని, అందులో ఏమైనా మీకు అందాయా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ తెలంగాణలోని ప్రతి మహిళకు ₹2500 ఇచ్చినట్లు చెబుతున్నారని చెప్పిన కేసీఆర్.. మీకు ఎవరికైనా ₹2500 వచ్చాయా? అంటూ అడిగారు. దీంతో ఏమీ రాలేదంటూ సమాధానం ఇచ్చారు. రైతుబంధు, రైతు రుణ మాఫీ, ₹500 బోనస్ గురించి కాంగ్రెస్ ఆడుతున్న డ్రామాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. చొప్పదండిలో ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతు చనిపోయిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే, దళితబంధు పథకం నిలిపివేశారని, ఆటోకార్మికులను ఆదుకోవడం లేదని మండిపడ్డారు. నిత్యం అబద్ధాలు చెబుతూ.. ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని, అలాగే ఎన్నికలు రాగానే ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్ చేస్తున్న బీజేపీని ఓడించి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్ షోలో పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ముస్లిం సోదరుల్లారా జాగ్రత్త

కాంగ్రెస్, బీజేపీ ముస్లిం సోదరులను ఇప్పటికే అనేక రకాలుగా మోసం చేసినయి. ముస్లిం సోదరుల్లారా.. జాగ్రత్తా! మీరు కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీ గెలిచే అవకాశం ఉంటుంది. దీంతో బండి సంజయ్ లాంటి మనిషి గెలుస్తాడు. సంజయ్ గెలిస్తే కరీంనగర్ గానీ, తెలంగాణకు గానీ ఏమీ పాయిదా ఉండదు. అదే వినోద్‌కుమార్ సెక్యులర్ మనిషి. ఆయనను గెలిపించాలి. **- కేసీఆర్**

కేసీఆర్ రోడ్‌షో సక్సెస్



# కరీంనగర్ కదనభేరి

కరీంనగర్ మరోసారి కదనభేరి మోగించింది. గులాబీ దళపతి కేసీఆర్‌కు మొదటి నుంచి అండగా నిలిచిన ఉద్యమ గడ్డ మరోసారి కదం తొక్కింది. అశేష జనం తరలివచ్చి అపూర్వ స్వాగతం పలికింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నీరాజనం పలికింది. రాంనగర్ నుంచి తెలంగాణ చౌక్ వరకు దారి పొడవునా అభిమానులు కురిపించిన పూల వర్షం మధ్య రోడ్‌షో అట్టహాసంగా సాగింది. మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతించగా, అడుగడుగునా 'జై కేసీఆర్.. కేసీఆర్ జిందాబాద్.. సీఎం కేసీఆర్' అన్న నినాదాలతో నగరం మార్మోగింది.

కరీంనగర్, మే 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కరీంనగర్ జిల్లాకేంద్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. రాజీవ్ రహదారి మీదుగా వచ్చిన ఆయన, ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బైపాస్‌రోడ్డు ద్వారా రాత్రి 7.50 గంటలకు కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితోపాటు పలువురు నాయకుల ఆధ్వర్యంలో వేలాది మంది ప్రజలు అధినేతకు అపూర్వ స్వాగతం పలికారు. రాంనగర్ చౌరస్తాకు చేరుకోగానే.. 'సీఎం కేసీఆర్' అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరికొంత మంది పూల వర్షం కురిపించారు. ప్రజల అభిమానాన్ని చూసిన కేసీఆర్.. బస్సులోనుంచే అభివాదం తెలిపారు. అనంతరం.. డప్పులు, సంప్రదాయ నృత్యాల మధ్య రాంనగర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ.. మంకమ్మ తోట, టూటౌన్ పోలీస్‌స్టేషన్, ముకరంపుర మీదుగా తెలంగాణ చౌక్ వద్దకు చేరింది. దాదాపు 40 నిమిషాలపాటు రోడ్‌షో కొనసాగగా.. దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా జనం నిలబడి 'కేసీఆర్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. పలు చోట్ల మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. రాత్రి 8.30 గంటలకు తెలంగాణ చౌక్ వద్దకు కేసీఆర్ చేరుకోగానే.. అప్పటికే ఆయన కోసం వేచి చూస్తున్న జనం ఒక్కసారిగా 'సీఎం కేసీఆర్.. సీఎం కేసీఆర్' అంటూ చేసిన నినాదాలు మార్మోగాయి. 'కేసీఆర్ జిందాబాద్' 'కారు గుర్తుకే మా ఓటు' అనే నినాదాలు హోరెత్తాయి. ఈ సమయంలో.. కేసీఆర్ బస్సుపైకి రాగానే.. జనం ఉత్సాహానికి అవధులు లేకుండా పోయాయి. బస్సు పైనుంచి కేసీఆర్ విజయ సంకేతం చూపుతూ అభివాదం తెలుపుతున్న సమయంలో.. రెండు మూడు నిమిషాలపాటు.. సభ 'జై కేసీఆర్.. సీఎం కేసీఆర్' అన్న నినాదాలతో హోరెత్తింది. ప్రజల అభిమానం చూసిన కేసీఆర్.. ఒక దశలో.. సభను నిశబ్ధంగా ఉంచడానికి కేసీఆరే ప్రజలను రిక్వెస్టు చేయాల్సి వచ్చింది. అయినా, నినాదాలు ఆగకపోవడంతో.. వీళ్లంతా మన వాళ్లే కదా..? అంటూ నవ్వుతూ మాట్లాడగానే.. నినాదాలు ఆగిపోయాయి. ఆ తర్వాత కేసీఆర్ సుమారు 25 నిమిషాలపాటు ప్రసంగించారు. వినోద్‌కుమార్ గురించి వివరించినప్పుడు.. 'జై వినోదన్న' అంటూ నినాదాలు మిన్నంటాయి. అలాగే కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను మరోసారి 'కరీంనగర్ భీముడు' అని సంబోధించినప్పుడు కూడా హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. అటు హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని 'హుజూరాబాద్ టైగర్' అంటూ, ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను 'వకీల్ సాబ్' అంటూ కేసీఆర్ సంబోధించినప్పుడల్లా జనం నుంచి కేకలు, ఈలలు వినిపించాయి. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ సాధించింది వినోద్‌కుమార్ అయితే అభివృద్ధి చేసి చూపించింది గంగుల కమలాకర్ అని అన్నారు. ఈ సందర్భంగా తీగల వంతెన గురించి కేసీఆర్ ప్రస్తావించారు. రోడ్ షో అనంతరం రాత్రి 9.40 గంటలకు తీగలగుట్టపల్లిలోని తెలంగాణ భవన్‌కు కేసీఆర్ చేరుకున్నారు.